11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 51 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప మంగళవారం 28 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 51 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA TUE 28 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## విశాఖలో భారీ వర్షం.. చెరువులను తలపిస్తున్న రోడ్లు

మొంథా తుపాను ప్రభావంతో విశాఖ నగరంలో భారీ వర్షం కురుస్తోంది. పలు చోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. కైలాసపురంలో గాలుల ప్రభావానికి చెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల రోడ్లపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఉండొద్దని జీవీఎంసీ అధికారులు ప్రజలను సూచించారు.



# మొంథా తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష..

## ప్రధాని మోదీ ఫోన్, యంత్రాంగానికి కీలక ఆదేశాలు


- మొంథా తుపానుపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష
- సీఎంకు ఫోన్ చేసి వివరాలు అడిగిన ప్రధాని మోదీ
- కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తుపాను
- రాత్రికి తీరం దాటే అవకాశం ఉందని అంచనా
- కృష్ణా జిల్లాకు అతి భారీ వర్ష సూచన
- పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా చంద్రబాబుకు ఫోన్ చేసి తుపాను పరిస్థితిపై ఆరా తీశారు.ప్రస్తుతం మొంథా తుపాను కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గంటకు 16 కిలోమీటర్ల వేగంతో ఇది తీరం వైపు కదులుతోందని, రేపు రాత్రికి తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. తుపాను ప్రభావంతో ఈరోజు, రేపు కృష్ణా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతీ గంటకు తుపాను కదలికలను గమనిస్తూ, వర్షాలు, వరదలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పంట నష్టం జరగకుండా

వివరాలు 2లో..

## ఏపీలో ఇప్పుడు హై అలర్ట్... కలిసికట్టుగా ఎదుర్కొందాం



- మొంథా తుఫానుపై అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం
- జీరో క్యాజువాలిటీ లక్ష్యంతో సహాయక చర్యలు ముమ్మరం
- 19 జిల్లాల్లో 40 లక్షల మందిపై ప్రభావం అంచనా
- సురక్షిత ప్రాంతాలకు వేలాది మంది ప్రజల తరలింపు
- రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా "జీరో క్యాజువాలిటీ" లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు ఐటీ, మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ప్రభుత్వ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని

వివరాలు 2లో..

రష్యా నుంచి చమురు కొనుగోలు..

## ట్రంప్ ప్రభుత్వంపై జైశంకర్ ఆగ్రహం



- ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కోదేశం పట్ల అమెరికా ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని విమర్శ
- నీతులు చెప్పేవారు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శ
- ఆసియాన్ సదస్సులో జైశంకర్ వ్యాఖ్యలు

వివరాలు 2లో..

## తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి



- మొంథా తుపానుపై కాకినాడ జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష
- తీరం దాటనున్న నేపథ్యంలో 12 మండలాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం
- ప్రాణ నష్టం నివారణే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపట్టాలని కీలక ఆదేశాలు
- గర్భిణులు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టమైన సూచనలు
- పునరావాస కేంద్రాల్లో ఆహారం, మందులు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం
- తుపాను సహాయక చర్యల కోసం కాకినాడకు రూ. కోటి అత్యవసర నిధి విడుదల

వివరాలు 2లో..

## 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్..




- 'ఎస్ఐఆర్'పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన
- బీహార్‌లో ఎస్ఐఆర్ విజయవంతమైందన్న ప్రధాన ఎన్నికల కమిషనర్
- రెండో దశలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తామని వెల్లడి
- 21 ఏళ్ల కింద ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్న జ్ఞానేశ్ కుమార్

పెన్ పవర్ డెస్క్:ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ)పై కేంద్ర ఎన్ని కల సంఘం సోమవారం కీలక ప్రకటన చేసింది. బీహార్‌లో

వివరాలు 2లో..

తుపానుపై సంచలన థంబ్ నెయిల్స్, హెడ్డింగ్‌లతో

## భయభ్రాంతులకు గురిచేయొద్దు



- మొంథా తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధం
- తుపాను వార్తలపై సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంయమనం పాటించాలన్న అనిత
- తప్పుడు థంబ్‌నెయిల్స్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని స్పష్టం
- సంచలన హెడ్డింగులతో గందరగోళం సృష్టించడం చట్టవిరుద్ధమని వెల్లడి

వివరాలు 2లో..

## విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా సత్యప్రమాణం చేసిన జోగి రమేశ్.. చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్




- నకిలీ మద్యం కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని జోగి రమేశ్ స్పష్టీకరణ
- కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన మాజీ మంత్రి
- లైడిటెక్టర్, నార్కో అనాలసిస్ టెస్టులకు తాను సిద్ధమని ప్రకటన
- తన వ్యక్తిత్వాన్ని హననం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- తనపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? అని సవాల్

వివరాలు 2లో..

'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

## అన్ని రాష్ట్రాలకు నోటీసులు



- 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ
- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ
- మోసాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం
- ఇది దేశవ్యాప్త కుంభకోణం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు
- ఈ మోసాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ ముఠాలు ఉన్నాయని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసా లపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది.

వివరాలు 2లో..

ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

## వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

- వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- ఆదేశాలు పాటించని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు సమన్లు
- పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలకు మినహాయింపు
- నవంబర్ 3న కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం
- దేశ ప్రతిష్ట దెబ్బతింటోందని ధర్మాసనం కీలక వ్యాఖ్య
- హాజరు కాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటిం చడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగా ణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా

వివరాలు 2లో..



## ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- ఏపీ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా రూ.33,630 కోట్ల విలువైన పనులు
- నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ పనుల పురోగతిపై చర్చ
- అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, కొత్త లైన్ల ప్రతిపాదనల ప్రస్తావన
- సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి, రైల్వే ఉన్నతాధికారులు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబా బు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రూ.33,630 కోట్ల విలువైన రైల్వే పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు

వివరాలు 2లో..

## గెలిస్తే అనుమానం వస్తుందని బీహార్‌లో బీజేపీ గెలవదు



- బీజేపీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీని గెలిపిస్తుందన్న పాల్
- ఈవీఎం ఉన్నంత వరకు బీజేపీయే అధికారంలో ఉంటుందని వ్యాఖ్య
- బ్యాలెట్ వధానం కోసం తాము పోరాడుతున్నామన్న కేఏ పాల్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# దటీజ్ చంద్రబాబు 70ఏళ్ల వయస్సులో చాలెంజ్

10 సంవత్సరాల వయసులో ఉన్న ఉత్సాహం 20 సంవత్సరాల వయసులో ఉండదు. ఇలా వయసు మారుతున్న కొద్దీ మనుషులలో మార్పులు వస్తుంటాయి. ఇది సహజంగా జరిగే ప్రక్రియే. కానీ కొంతమంది వయసు వెనక్కి పంపించేస్తుంటారు. తమ ఉత్సాహం ముందు.. తమ క్రమశిక్షణమందు వయసును చిన్నబోయేలా చేస్తారు. అటువంటి వారిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకరు. వాస్తవానికి ఈ జాబితాలో చంద్రబాబు నాయుడు కు మొదటి స్థానం ఇవ్వాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల కోసం నాడు చంద్రబాబు నాయుడు అనేక దేశాలు తిరిగారు. మైక్రోసాఫ్ట్ అనే సంస్థను హైదరాబాద్ తీసుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ ద్వారా ఐటీకి ఒక ఎకో సిస్టం డెవలప్ చేశారు. ఈరోజు హైదరాబాద్ ఐటి విభాగంలో ఈ స్థాయిలో అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడు అనడంలో ఎటువంటి అనుమానం అక్కర్లేదు. ఈ విషయాన్ని అనేకమంది ముఖ్యమంత్రులు.. అనేకమంది నాయకులు ఒప్పుకున్నారు. చంద్రబాబు నాయుడు మొదటినుంచి కూడా ఆహారం తీసుకునే విషయంలో కట్టుదిట్టంగా ఉంటారు. ఏమాత్రం దానిని బ్రేక్ చేయరు. ఆయనకు ఎంతో కాలం నుంచి మధుమేహం ఉంది. అయినప్పటికీ అయినప్పటికీ దానిని నియంత్రణలో ఉంచుకుంటున్నారు. చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లో కూడా అన్నం తినరు. కేవలం తృణధాన్యాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. కాఫీ తాగుతారు. గ్రిల్డ్ ఫిష్ తీసుకుంటారు. నాన్ వెజ్ విషయంలో ఆయనకు చాలా లెక్కలు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేస్తారు. యోగా చేస్తారు. మెడిటేషన్ కూడా చేస్తారు. అందువల్ల చంద్రబాబు ఏడుపదుల వయసు దాటినప్పటికీ కూడా ఉత్సాహంగా కనిపిస్తుంటారు. ప్రతి విషయాన్ని కూడా గుర్తుంచుకుంటారు. ఆ విషయాన్ని చెప్పడానికి ఏమాత్రం సంకోసించరు. చంద్రబాబు ప్రస్తుతం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మించడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్నప్పటికీ చంద్రబాబు స్వీయ శక్తిని నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. ఈ వయసులో కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రాంతంలో అనేక దేశాలను తిరిగివచ్చారు. అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పెట్టుబడుల సదస్సుకు రావాలని అక్కడి కంపెనీల అధిపతులను కోరారు. అక్కడి ప్రభుత్వ అధినేతలను విన్నవించారు. అమరావతిలో భారీగా విదేశీ సంస్థలను తమ కార్యకలాపాలు ప్రారంభించే దిశగా చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరకంగా ఇది సానుకూల అంశం. ఏపీ రాష్ట్రానికి మరింత సానుకూల అంశం. రాజకీయాల విషయాలను పక్కన పెడితే చంద్రబాబు ఈ వయసులో కూడా అక్కడికి వెళ్లడం ఒకరకంగా అద్భుతం అని చెప్పాలి. ప్రత్యేకమైన విమానాలు ఉన్నప్పటికీ.. అనేక రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఈ వయసులో ఆయన అక్కడికి వెళ్లడం మిరాకిల్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. కొన్ని రాష్ట్రాలలో చంద్రబాబు కంటే తక్కువ వయసు ఉన్నవారు.. చంద్రబాబుతో సమానంగా వయసు ఉన్నవారు.. చంద్రబాబు కంటే ఎక్కువ వయసు ఉన్నవారు ముఖ్యమంత్రులుగా పనిచేస్తున్నారు. కానీ చంద్రబాబు మాదిరిగా ఎవరూ పెట్టుబడుల కోసం ఇతర దేశాలకు వెళ్లడం లేదు. ఇతర దేశాల కంపెనీల ప్రతినిధులను ఒప్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి విషయంలో అహర్నిశలు శ్రమించడం లేదు. సాధారణంగా ఒక వయసుకు వచ్చిన తర్వాత చాలామంది ఉత్సాహంగా పనిచేయలేరు. ముఖ్యంగా 70 సంవత్సరాల వయసు దాటిన తర్వాత చాలామంది రిలాక్స్ అవ్వాలని కోరుకుంటారు. వయసు వల్ల వచ్చిన నీరసం కూడా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. కానీ చంద్రబాబుకు అలసట అనేది తెలియడం లేదు. నీరసమనేది దరిచేరడం లేదు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. తన కలల రాజధాని కోసం విపరీతంగా శ్రమిస్తున్నారు. కేంద్రం నుంచి మొదలుపెడితే విదేశాల వరకు ఆయన అన్ని తలుపులను కూడా తడుతున్నారు. ఉజ్వలమైన ఏపీ కోసం బలమైన అడుగులు వేస్తున్నారు. ఒక నాయకుడు అనే వాడు బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. దృఢమైన ఆలోచనలను అమలు చేయాలి. అప్పుడే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది. ఇప్పుడు చంద్రబాబు చేస్తోంది కూడా అదే.

## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...
## వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

- మొదటి పేజి తరువాయి

హాజరు కావాలని సోమవారం ఆదేశిం చింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. “అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి” అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. “దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం” అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (%=ఔా%), వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. “దేశంలోని %=ఔా%లన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి” అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

# తుపానుపై సంచలన థంబ్ నెయిల్స్, హెడ్డింగ్‌లతో భయభ్రాంతులకు గురిచేయొద్దు

ఏపీకి మొంథా తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని, సహాయక చర్యలకు సర్వసన్నద్ధంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందని, ముఖ్యంగా సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సంచలనాల కోసం తప్పుడు థంబ్‌నెయిల్స్, హెడ్డింగులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె హితవు పలికారు.

**ప్రభుత్వం పూర్తి సన్నద్ధం**

తుపాను హెచ్చరికలు వెలువడిన నాటి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందని మంత్రి అనిత తెలిపారు. గత మూడు రోజులుగా సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ తో కలిసి తాను కూడా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని, అన్ని విభాగాలను అప్రమత్తం చేశామని వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో పాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించేందుకు జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, సహాయక చర్యలకు అవసరమైన నిధులను కూడా విడుదల చేశామని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, మీడియా ద్వారా వాస్తవ పరిస్థితులను వివరిస్తున్నామని తెలిపారు.

**సోషల్ మీడియా బాధ్యతగా వ్యవహరించాలి**

విపత్కర సమయాల్లో సమాచారాన్ని వేగంగా చేరవేసే సోషల్ మీడియా, డిజిటల్ మీడియా వేదికలు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి అనిత నొక్కిచెప్పారు. అయితే, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలు కేవలం వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా థంబ్‌నెయిల్స్, సంచలన హెడ్డింగులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఆర్టీజీఎస్ సెంటర్ ద్వారా ఈ విషయం తమ పరిశీలనలోకి వచ్చిందని, ఇలాంటి తప్పుడు ప్రచారాల వల్ల ప్రజల్లో తీవ్ర గందరగోళం, అలజడి నెలకొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. “సంచలనాల కోసం, వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా వ్యవహరించడం చట్టవిరుద్ధం. అభూత కల్పనలు, అవాస్తవాలతో కూడిన సమాచారం తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను, వారి కుటుంబ సభ్యులను మానసికంగా కుంగదీస్తుంది. దీన్ని నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది” అని అనిత స్పష్టం చేశారు. వార్తల కవరేజీలో వాస్తవాలకు అద్దం పట్టేలా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని ఆమె సూచించారు. సమాచార వ్యాప్తిలో కీలకపాత్ర పోషించే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా కూడా ఈ విపత్కర సమయంలో ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలవాలని హోం మంత్రి కోరారు.

# రష్యా నుంచి చమురు కొనుగోలు.. ట్రంప్ ప్రభుత్వంపై జైశంకర్ ఆగ్రహం

రష్యా చమురు విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తీవ్రంగా ఖండించారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో అమెరికా ఒక్కో దేశంతో ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. నీతులు బోధించేవారే వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకం విధిస్తున్న విషయం విదితమే. చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ దేశాలపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో జైశంకర్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా సత్యప్రమాణం చేసిన జోగి రమేశ్.. చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్

నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో సత్యప్రమాణం చేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఆయన, ఘాట్ రోడ్డు ప్రవేశద్వారం వద్ద చేతిలో దీపం వెలిగించి, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జోగి రమేశ్ మాట్లాడుతూ.. “నా వ్యక్తిత్వంపై నింద వేశారు. నా మనసును గాయపరిచారు. అందుకే కుటుంబంతో సహా వచ్చి, ఏ తప్పు చేయలేదని అమ్మవారి ఎదుట నిండు మనసుతో ప్రమాణం చేశాను. నా కుటుంబాన్ని అవమానించిన వారికి అమ్మవారు మంచి బుద్ధి ప్రసాదించాలి” అని అన్నారు. గతంలో తాను చెప్పినట్లే తిరుపతి వెంకన్న, బెజవాడ దుర్గమ్మపై ప్రమాణానికి కట్టుబడి ఉన్నానని, అందులో భాగంగానే ఇప్పుడు ప్రమాణం చేశానని తెలిపారు. నకిలీ మద్యం కేసులో నార్కో అనాలసిస్, లైడిటెక్టర్ టెస్టులకు కూడా తాను సిద్ధంగా ఉన్నానని పునరుద్ఘాటించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. “నాపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? కనీసం లైడిటెక్టర్ టెస్టుకైనా వచ్చే దమ్ముందా? కనకదుర్గమ్మ సాక్షిగా నేను తప్పు చేసినట్లు నిరూపించాలి” అని సవాల్ విసిరారు.

# తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి

మొంథా తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రాణ నష్టాన్ని నివారించడమే ప్రథమ కర్తవ్యంగా భావించి, ముందస్తు రక్షణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం, సహాయక చర్యలపై కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, “మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లాలోని 12 మండలాలపై అధికంగా ఉంటుందని సమాచారం. రేపు కాకినాడ పరిసర ప్రాంతాల్లో తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. యంత్రాంగం 24 గంటలూ అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. తీర ప్రాంత ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే జిల్లాలో 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, పాలు, అత్యవసర ఔషధాలు సిద్ధంగా ఉంచాలి” అని దిశానిర్దేశం చేశారు.

ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ సూచించారు. “పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న గర్భిణులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను పునరావాస కేంద్రాలకు చేర్చినట్లు కలెక్టర్ తెలిపారు. వారికి అవసరమైన పౌష్టికాహారం, వైద్య సేవలు నిరంతరం అందేలా చూడాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి. తుపానుపై భయాందోళనలు సృష్టించకుండా, గ్రామాల్లో మైకుల ద్వారా సహాయక చర్యలను వివరిస్తూ ప్రజలకు ధైర్యం చెప్పాలి” అని ఆయన అన్నారు.

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

తుపాను సహాయక చర్యల్లో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లిన ప్రజల ఇళ్లకు దొంగల బెడద లేకుండా పోలీసులు ప్రత్యేక భద్రత కల్పించాలని, అవసరమైతే సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున, ఆయకట్టు ప్రజలను జలవనరుల శాఖ అధికారులు ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. బలహీనంగా ఉన్న చెరువు కట్టలు, కాలువ గట్లను గుర్తించి ఇసుక బస్తాలతో పటిష్ఠం చేయాలని సూచించారు.

మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలని, వారి బోట్లకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. తుపాను కారణంగా నిత్యావసర వస్తువుల సరఫరాకు ఆటంకం కలగకుండా మార్కెటింగ్ శాఖ చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉన్నందున, మరమ్మతుల కోసం సిబ్బందిని సిద్ధం చేయాలని, అత్యవసర సమాచారం కోసం శాటిలైట్ ఫోన్లను వినియోగించాలని సూచించారు.

**కాకినాడకు కోటి రూపాయల అత్యవసర నిధి**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్లు విడుదల చేయగా, అందులో కాకినాడ జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ నిధులను పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, బాధితులకు నిత్యావసరాల పంపిణీ, దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ సాయం అందించడం వంటి కార్యక్రమాలకు వినియోగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# ఏపీలో ఇప్పుడు హై అలర్ట్... కలసికట్టుగా ఎదుర్కొందాం

- మొదటి పేజి తరువాయి

ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తుపాను సన్నద్ధతపై ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో దాదాపు 40 లక్షల మంది ప్రజలు తుపాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. వీరి భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదకర ప్రాంతాల్లోని 1,238 గ్రామాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బాధితుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,906 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ముఖ్యంగా 3,465 మంది గర్భిణులు, బాలింతలను గుర్తించి, వారిని సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

ముందస్తు చర్యల్లో భాగంగా 14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, వాటిలో 364 పాఠశాలలను తుపాను షెల్టర్లుగా మార్చారు. అక్టోబర్ 29 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బోటింగ్, బీచ్‌లలో పర్యాటకంపై పూర్తి నిషేధం విధించినట్లు లోకేశ్ వెల్లడించారు. సహాయక చర్యల కోసం 11 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. అగ్నిమాపక సిబ్బంది, బోట్ బృందాలు, చెట్లను తొలగించే బృందాలను లైఫ్ జాకెట్లు, ఇతర రక్షణ పరికరాలతో సిద్ధం చేశారు. అత్యవసర వైద్య సేవలకు 325 మెడికల్ క్యాంపులు, 876 ఆరోగ్య తక్షణ స్పందన బృందాలు, 108, 104 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. మూడు బోట్ క్లినిక్‌లను కూడా క్రియాశీలకం చేశారు.

తుపాను అనంతరం విద్యుత్ పునరుద్ధరణ కోసం 772 బృందాలను 11,347 స్తంభాలు, 1,210 ట్రాన్స్‌ఫార్మర్లతో సిద్ధంగా ఉంచారు. రహదారులపై అడ్డంకులను తొలగించడానికి 7,289 యంత్రాలు, తాగునీటి సరఫరాకు 1,521 ట్యాంకర్లు, 1,037 జనరేటర్లు ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం కలగకుండా 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు, 10 మొబైల్ నెట్‌వర్క్ టవర్లను (%జూఔం%) కీలక ప్రాంతాల్లో మోహరించారు. ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్మీ, ఎన్డీఎంఏ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి నారా లోకేశ్ వివరించారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని మంత్రి లోకేశ్ సూచించారు. ప్రభుత్వం జారీ చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. ఈ విపత్తును అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఆయన పిలుపునిచ్చారు.

# గెలిస్తే అనుమానం వస్తుందని బీహార్‌లో బీజేపీ గెలవదు

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవదని, ఆ పార్టీయే ఆర్జేడీని గెలిపిస్తుం దని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో అసలైన ఓట్లను తొలగించి, లేని ఓట్లను చేర్చారని ఆరోపించారు. దేశంలో ఈవీఎం ద్వారా ఓటింగ్ ఉన్నంత వరకు బీజేపీ అధికారంలో ఉంటుందని ఆయన వ్యాఖ్యా నించారు. బీహార్‌లో బీజేపీ గెలిస్తే దేశ ప్రజలకు అనుమానం వస్తుందనే ఆలోచనతో అక్కడ ఆర్జేడీని గెలిపిస్తారని ఆయన జోస్యం చెప్పారు. ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే జరగాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాలెట్ విధానం కోసం తన పార్టీ పోరాడుతోందని కేఏ పాల్ పేర్కొన్నారు.

## ‘డిజిటల్ అరెస్ట్’ మోసాలపై సుప్రీం సీరియస్... అన్ని రాష్ట్రాలకు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించా లని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. “దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం” అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ‘డిజిటల్ అరెస్ట్’ మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది.

కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు. విచారణ సందర్భం గా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడా నికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన ‘డిజిటల్ అరెస్ట్’ సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

## మొంథా తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష..

- మొదటి పేజి తరువాయి

కాలువ గట్లను పటిష్టం చేయాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని మంత్రి నారా లోకేశ్‌కు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్..

- మొదటి పేజి తరువాయి

ఎస్ఐఆర్ విజయవంతమైందని, మరో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో దీనిని నిర్వహించబోతున్నామని తెలిపింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, రెండో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను త్వరలో చేపట్టనున్నామని వెల్లడించారు.

1951 నుంచి 2004 వరకు ఎనిమిదిసార్లు ఎస్ఐఆర్ నిర్వహించారని అన్నారు. 21 ఏళ్ల కిందట ఓటర్ల జాబితా సవరణ జరిగిందని గుర్తు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, అక్రమ వలసదారులు, చనిపోయిన, బదిలీ చేయబడిన ఓటర్లను తొలగించినట్లు వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. బీహార్‌లో 7.5 కోట్ల మందితో ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తయిందని అన్నారు. బీహార్‌లో ఈ ప్రక్రియపై ఎవరూ అభ్యంతరాలు చెప్పలేదని తెలియజేశారు. రెండో దశలోనూ ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటరుపై నిర్ధారణ చేసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్‌పై రాజకీయ అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. రెండో దశలో ప్రత్యేక సమగ్ర సవరణ జరగనున్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు: అండమాన్ నికోబర్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్. రెండో దశ ఎస్ఐఆర్ జరగనున్న రాష్ట్రాల్లో 51 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారని, నవంబర్ 4వ తేదీ నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. అసోంలో ఎన్ఆర్సీ ఉన్నందున ఎస్ఐఆర్ లేదని స్పష్టం చేశారు.

## ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఈ కీలక ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమీక్షలో పలు ముఖ్యమైన రైల్వే లైన్ల పనుల పురోగతిపై అధికారులు నివేదిక సమర్పించారు. ముఖ్యంగా నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ డబ్లింగ్, గుణదల-ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్-తుముకూరు మధ్య కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులు ఎంతవరకు వచ్చాయో చర్చకు వచ్చింది. వీటితో పాటు, రాష్ట్రంలో కొత్తగా చేపట్టాల్సిన రైల్వే లైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ), అండర్ బ్రిడ్జి (ఆర్ యూబీ)ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖకు పంపిన ప్రతిపాదనలపైనా సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వేలకు చెందిన పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం.

# రిక్షా కార్మికునికి నిత్యావసర వస్తువులు అందజేసిన ఈదా రత్నశ్రీ

**నాయుడుపేట, పెన్ పవర్, అక్టోబర్ 27**

మౌనిక మదర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈదా రత్నశ్రీ ఓ రిక్షా కార్మికునికి బియ్యం,నిత్యావసర వస్తువులు అందించారు. భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని లోతు వానిగుంట ప్రాంతానికి చెందిన రిక్షా కార్మికుడు షేక్ మస్తాన్ అనారోగ్య కారణంగా ఇబ్బందులు పడడం గమనించిన మౌనిక మదర్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు ఈదా రత్నశ్రీ సోమవారం తమ కార్యాలయం వద్ద 20 కిలోల బియ్యం బస్తాలతో పాటు నిత్యవసర వస్తువులు,కొంత నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ నాయుడు, సాయి నాయుడు,రేష్మ,అరుణ తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు

# ప్రతి రైతుకు సరిపడా యూరియా అందిస్తాం

**- వట్టికుండల శేఖర్ నాయుడు**



**పెళ్లకూరు, పెన్ పవర్, అక్టోబర్ 27**

మండలంలో వ్యవసాయ సాగుకు అవసరమైన మేరకు యూరియాను ప్రభుత్వం అందజేస్తుందుని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్ నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని కలవకూరు రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ నాయుడు మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలతో పాటు సొసైటీ గోడౌన్ లలో యూరియా అందుబాటులో ఉంచుతామని రైతులు అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలపాటి సురేష్ తదితరులు ఉన్నారు.

# సిపిఐ నేత కాలేషా మృతదేహానికి ఎమ్మెల్యే పాశిం నివాళులు



**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,27**

గూడూరు లోని 2 వ పట్టణ పరిధిలో స్వర్గస్తులైన సీపీఐ కార్యదర్శి షేక్ కాలేషా భౌతికకాయానికి గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజహితాన్ని కాంక్షిస్తూ ప్రజల కోసం జీవితాన్ని అర్పించిన కాలేషా సేవలు చిరస్మరణీయం అని అన్నారు.

# సిపిఐ నేత కాలేషాకు నివాళులర్పించిన పలువురు ప్రజా ప్రతినిధులు







**గూడూరు పెన్ పవర్ అక్టోబర్ 27**

గూడూరు పట్టణంలోని రెండవ వార్డు పరిధి నివాసి సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా సోమవారం మృతి చెందారు. కాలేషా మృతదేహాన్ని గూడూరు శాసనసభ్యులు డాక్టర్ ఎం. పాశిం సునీల్ కుమార్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తో పాటు పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వామపక్ష పార్టీల నాయకులు, పలు ప్రజా సంఘాలు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజా సమస్యల పట్ల కాలేషా పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. ఎల్లప్పుడూ సమాజ హితాన్ని కాంక్షిస్తూ ,ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడే నిఖార్సయిన వ్యక్తి కాలేషా అని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

# తుఫాను ప్రభావంపై ప్రజలు భయపడాలసిన అవసరం లేదు

**పలమనేరు,పెన్ పవర్,అక్టోబరు 27**

తుఫాను ప్రభావంపై ప్రజలు భయపడాలసిన అవసరం లేదని,ప్రజలకు మున్సిపల్ కమిషనర్ రమణా రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం పురపాలక సంఘ పరిధిలో మోత తుఫానుకు ముందస్తు చర్యల్లో భాగంగా మునిసిపల్ కమీషనర్ వర్షాభావ ప్రభావిత ప్రాంతాలు,లోతట్టు, ముంపు ప్రాంతాలైన పెద్దచెరువు,బాలాజీ సూపర్ బజార్ ఏరియా, ఎద్దులచెరువు తదితర ప్రాంతాలను తనిఖీ చేశారు. శాసన సభ్యులు అమర్నాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్టీ కాలనీ, దండపల్లి రోడ్,లక్ష్మీ నగర్ మరియు శ్రీనగర్ కాలనీ లలో తక్షణ చర్యలలో భాగంగా వెట్ మిక్స్ ద్వారా గుంతలను పూడ్చుడము మరియు రాకపోకలకు అనువుగా దారులను జేసీబీ సహాయముతో చదును చేయించారు. ముంపు ప్రాంతాలలో గల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవలసినదిగా సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలందరూ కాచి వడబోసిన నీటిని త్రాగాలని,అంటువ్యాధులు ప్రభలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరియు పట్టణములోని ఎద్దులసంత సంప్ నందున్న ఈఎల్ఎస్ఆర్ ట్యాంక్ ను సందర్శించి నీటి సరఫరా మరియు క్లోరినేషన్ తనిఖీ చేశారు. హెల్త్ డిపార్టుమెంటుతో కో-ఆర్డినేషన్ చేసుకొని పట్టణములో వర్షాకాల ప్రభావము వలన అంటువ్యాధులు ప్రభలకుండా నీరు నిల్వ ఉన్న కొబ్బరి చిప్పలు, టైర్లు,నీటి తొట్టెలు,



డ్రమ్ములు ఎప్పటికప్పుడు శుభ్రము చేసుకొనవలెనని సంబంధిత సెక్రెటరీలు మరియు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. మోంత తుఫాను దృష్ట్యా రాన్నున 28వ తేదీ మంగళవారం,29వ తేదీ బుధవారం వరకు పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,మరియు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు మరియు ఇబ్బంది కలిగిన పురపాలక సంఘ నందు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనదని మరియు టోల్ ఫ్రీ నెంబర్ టోల్ ఫ్రీ నెం. 7337388215 కు వెంటనే సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేసారు. ఇందులో మునిసిపల్ కమీషనర్



వెంట పురపాలక సంఘ సిబ్బంది,మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎ టి ఎస్ సెంటర్లు రద్దు చేయాలి

## రవాణా వాహనాల పై అధిక భారాలు





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ అక్టోబర్ 27**

మోపే ఏ టి ఎస్ సెంటర్లను రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి చల్ల కొలుసు మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం వద్ద నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా నిర్వహించి తాసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా వాహనాలు ఫిట్ సర్టిఫికెట్లను మంజూరు ఆర్ టి ఎ అధికారులు నుండి కాకుండా ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడం రవాణా వాహనాలపై అధిక ఆర్థిక భారం అన్నారు. ఎ టి ఎస్ సెంటర్లో వాహనం స్కానింగ్ చేస్తారని ఏ చిన్న తప్పిదనం ఉన్న అదే రిజెక్ట్ చేస్తుందని మరల వాహనదారుడు స్లాట్ బుక్ చేసుకుని ఫీజు అదనంగా కట్టాల్సి వస్తుందని ఇది ఒక రకమైన భారమైతే, నెల్లూరు జిల్లా అంతటికి ముత్తుకూరు దగ్గర కప్పల దరువులో ప్రైవేటు కాంట్రాక్టర్ ఎ టి ఎస్ సెంటర్ ను ఏర్పాటు చేశారని జిల్లాలో అన్ని ప్రాంతాల నుండి ఇక్కడికి రావడం ఆర్థిక భారం అవుతుందన్నారు. కందుకూరు నుండి సీతారాంపురం నుండి రాపూర్ నుండి అనంతసాగరం నుండి వాహనదారులు సుమారు 100 నుండి 150 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తుంది. సమయానికి రాకుంటే వారి స్లాట్ రద్దువుతుందని మరల డబ్బులు కట్టి ఫ్లాట్ బుక్ చేసుకోవడం భారం అవుతుందన్నారు. ఈ ఇబ్బందులను ఆసరా చేసుకుని బ్రోకర్లు ఏర్పడ్డారని మీరు వాహనదారుల నుండి వేలాది రూపాయలు వసూలు చేసి చేస్తున్నారన్నారు. అందువలన ఆర్థిక భారం పెరుగుతుందని ప్రభుత్వం తక్షణమే ఈ ఏ టి ఎస్ సెంటర్ ను రద్దుచేసి పాత పద్ధతిలో ఆర్టిఏ అధికారులే ఎఫ్సీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి దాసరి రాదయ్య నాయకులు మాల్యాద్రి, రమేష్, నాగరాజు, వెంకీ, శివ, సుబ్బారావు ఆటో కార్మికులకు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ను కలిసిన వెంకటేశ్వరస్వామి పాలకమండలి సభ్యులు



**గూడూరు,పెన్ పవర్,అక్టోబర్, 27**

గూడూరు పట్టణంలోని రాజా వీధిలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తమకు అందించిన సహకారం పట్ల ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలకు తాము కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి రామ్మోహన్ రావు, పేపళ్ల అమరయ్య నాయుడు, మంగళపూర్ గోపాల్, పర్వతాల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాను పట్ల ఎలాంటి భయాందోళన అవసరం లేదు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు,పెన్ పవర్, అక్టోబరు 27**

మొంథా తుఫాను వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం కానీ,ఆస్తి నష్టం కానీ వాటిల్లే అవకాశం లేకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన సహాయక చర్యలు అందించేందుకు అప్రమత్తంగా ఉందని. తుఫాను పట్ల భయభ్రాంతులను చేసే పుకార్లను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు సూచించారు. ఈ నెల 28,29 తేదీల్లో "మొ%ళి%థా" తుఫాన్ ప్రభావం జిల్లాకు కూడా ఉండడంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రాష్ట్ర వాతావరణ విఫత్తుల నియంత్రణ శాఖ రెడ్ అలెర్ట్ ను ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తూ పలు హెచ్చరికలను కూడా జారీ చేశారు. తుపాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ప్రధానంగా పలు సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దు,ప్రశాంతంగా ఉండండి,భయాందోళన అవసరం లేదు. అత్యవసర కమ్యూనికేషన్ కోసం మీ మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసుకుంటూ ఉండండి, వాతావరణ హెచ్చరికలు కోసం మెస్సేజ్లను గమనిస్తూ ఉండండి. మీ ఇల్లు సురక్షితం కాకపోతే, తుపాను ప్రారంభం కాకముందే సురక్షితమైన ఆశ్రయం,షెల్టర్ కు చేరుకోండి. పాత భవనాలు,చెట్లు, విద్యుత్ వైర్లు స్తంభాల కింద ఎప్పుడూ ఉండకండి. అత్యవసర సహాయ సమాచారం నిమిత్తం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంతో పాటు చిత్తూరు,పలమనేరు, నగరి,కుప్పం ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం.




చిత్తూరు కంట్రోల్ రూమ్ :08572-242777
ఆర్డీవో కార్యాలయం, చిత్తూరు: 6302905772
ఆర్డీవో కార్యాలయం, పలమనేరు: 9491074510
ఆర్డీవో కార్యాలయం, నగరి : 9491803680
ఆర్డీవో కార్యాలయం, కుప్పం : 9491074513, 6303024467

అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణలో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నెంబర్లు: 112,1070, 1800 425 0101 లకు కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# గిరిజన కాలనిలో నీటి సరఫరా చేయాలి

**సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత.**



**కావలి :పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్) అక్టోబర్ 27**

కావలి పట్టణం 17వ వార్డు బుడమగుంట గిరిజనకాలనీ కు మున్సిపల్ నీటి సరఫరా చేయాలని సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానికులు ఆర్డీవో కార్యాలయంలో డి.ఏ.ఓ. ఉరూజ్,కి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ 17వ వార్డు బుడమ గుంట గిరిజన కాలనీలో సుమారు వంద కుటుంబాల గిరిజనులు నివాసం ఉంటున్నారని తెలిపారు. వీరు నిరుపేదలని, వీరికి ఇప్పటివరకు మునిసిపల్ తాగునీటి సరఫరా లేదన్నారు. గత 10 సంవత్సరాలకు పైబడి నివాసం ఉంటున్నా, మున్సిపల్ అధికారులు త్రాగునీటి సరఫరా చేయకపోవడం అన్యాయ మన్నారు. ట్యాంకర్ ద్వారా తోలుతున్ననీళ్లు, త్రాగేందుకు ఉపయోగపడవన్నారు. తాగునీటికి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మున్సిపల్ నీటి సరఫరా చేయాలని అనేకసార్లు స్థానికులు అధికారులను కోరినప్పటికీ నీటిసరఫరాజరగలేదన్నారు. పది సంవత్సరాల నుండి గిరిజన కాలనీలో నివసించే వారు త్రాగునీటి కొరకు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీ పనులు, చేతివృత్తులు చేసుకొని జీవనం గడుపుతున్న పేదలన్నారు. ఎన్నికల అప్పుడు ఎన్నో హామీలను ఇచ్చి అధికారం లోకి వచ్చిన నాయకులు ప్రజా సమస్యలు పరిష్కరించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు గిరిజనులకు మునిసిపల్ త్రాగు నీటిని సరఫరా చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేపట్టవ లసివస్తుందన్నారు. ఈకార్య క్రమంలో సిపిఎం నాయకులు వై కృష్ణమోహన్, జి. మధు సూదన్ రావు, సిఐటియు పట్టణ అధ్యక్షులు పి. తిరు పాలు,స్థానికులు సి. హెచ్. లక్ష్మయ్య,సి. హెచ్. సుశీల తోపాటు స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

# కలుజు కాలువ పనులు పర్యవేక్షించిన తాహసిల్దార్ శ్రావణ్ కుమార్



**కావలి :పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్ )అక్టోబర్ 27**

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ ముప్పు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కావలి పట్టణంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా ముందస్తు జాగ్రత్త చర్యలను పటిష్ఠం చేశాయి. ముఖ్యంగా వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు వీలుగా కాలువ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు.

**అధికారుల పర్యవేక్షణలో...** కావలి ఆర్డిఓ వంశీకృష్ణ సూచనలతో, కావలి తాసిల్దార్ శ్రావణ్ కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. తుమ్మలపెంట రహదారి పక్కన ఉన్న పాపిరెడ్డి చెరువు కలుజు నుండి నీరు వెళ్లేందుకు ఉద్దేశించిన కాలువ పూడికతీత పనులను ఆయన దగ్గర ఉండి పర్యవేక్షించారు. చెరువులోకి అధికంగా నీరు చేరినప్పుడు, ఆ నీరు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు వీలుగా ఈ కాలువను శుభ్రం చేయించడం జరిగింది. తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రధానంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల సమన్వయంతో ఈ పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఏఈ జంపాని కిరణ్ తో పాటు ఇతర సిబ్బంది, కింది స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# 'మొంథా'తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### -తుఫాన్ ప్రత్యేక అధికారి అరుణ బాబు



**నాయుడుపేట, పెన్ పవర్, అక్టోబర్ 27**

మొంథా'తుఫాన్ పట్ల నిర్లక్ష్యం వహించకుండా అధికారులు,సిబ్బంది మరో మూడు రోజులు పాటు అప్రమత్తంగా ఉండాలని తుఫాన్ ప్రత్యేక అధికారి అరుణ బాబు సూచించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎటువంటి ఇబ్బంది కలిగినా తహసిల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. సోమవారం నాయుడుపేట తహసిల్దార్ కార్యాలయంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి,నాయుడుపేట తహసిల్దార్ ఎం రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా,సీఐ బాబి లతోపాటు రెవిన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 3 రోజులు వర్షాలు ఎక్కువగా వస్తాయని తెలిపారు.వర్షాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లలోను, కూలిపోయే చెట్ల కింద ఉండొద్దని, విద్యుత్ స్థంబాల చెంతకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు.ప్రజలందరూ వీలైనంత వరకు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని తెలిపారు. నీరు నిలిచే ప్రాంతాలకు,అండర్ బ్రిడ్జిలు వద్దకు వెళ్ళవద్దని తెలిపారు.పడిపోయే చెట్లు, కూలిపోయే భవనాలు ఉంటే అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.పునరావాస కేంద్రాల్లో నీరు,ఆహారం,వసతి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అధికారులు,సిబ్బంది అందించే సూచనలు,సలహాలు పాటించి సురక్షితంగా ఉండాలని తెలిపారు.

# ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం





**పలమనేరు,పెన్ పవర్, అక్టోబరు 27**

ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆర్టీసీ డిఎం అల్తాఫ్ అన్నారు.సోమవారం ఆయన ఆర్టీసీ బస్టాండ్ నందు ఆకస్మికంగా పర్యటించారు.శనివారం రోజు కురిసిన భారీ వర్షానికి బస్టాండ్ ఆవరణం వర్షపు నీరుతో నిండిపోయింది.దానికి నష్ట నివారణ చర్యలు చేపట్టబోతున్నట్లు తెలిపారు.ముఖ్యంగా బస్టాండుకు ఇరువైపులా ఉన్న రాజు కాలువలలో వ్యర్థాల వలన నీరు సరిగా పోకుండా బస్టాండ్ మరియు లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు మరియు డ్రైనేజీ వాటర్ చేరుకుంది.మరోసారి ఇలాంటి ఘటనలకు తావు లేకుండా మున్సిపల్ అధికారులతో కోఆర్డినేషన్ చేసుకొని ఆర్టీసీ బస్సు ప్రాంగణం మరియు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రాజు కాలువలను పరిశీలించారు. ఈసందర్భంగా దుకాణాల మధ్య కాలీ ప్రదేశాలలో చెత్త ఎక్కువగా ఉండటం వలన ఆ ప్రదేశాలను ఆయన దగ్గరుండి శుభ్రం చేయించారు. తదుపరి బస్సు ప్రయాణికులను కలిసి వచ్చిపోయే సర్వీసులలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలపాలని కోరి వారి సమస్యలను తన దృష్టికి తీసుకురమ్మని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం తో బాటు ఏడిఎం లక్ష్మీనారాయణ,ఆర్టీసీ సిబ్బంది రాజా తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనారిటీ నాయకులచే గాదిపాకుల గోపీనాథ్ కి ఘన సన్మానం









**శ్రీకాళహస్తి , పెన్ పవర్. , అక్టోబర్ 27**

శ్రీకాళహస్తి పట్టణంలో ముస్లిం మైనారిటీ నాయకులు, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా నియమితులైన గాదిపాకుల గోపీనాథ్ ని ఘనంగా సన్మానించి స్వీట్స్ పంచుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ సోదరులు మాట్లాడుతూ "తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు న్యాయం చేయడం, నాయకులకు గౌరవం ఇవ్వడం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబం ప్రత్యేకత" అని అభిప్రాయపడ్డారు. గోపీనాథ్ ని ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా నియమించడం దానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షాకిర్ అలీ, ఖాదర్ భాష, షఫీ, ఖలీల్, ఫ్రూట్ మీర్జా, షేక్ జహీర్ అహ్మద్, %ఫ్రు.ఐ%. మస్తాన్, మీర్జా, రఫీ బాయ్, ఖాదర్ వలీ, సాజిద్, నయీమ్, జావిద్, రాజా, ఇర్ఫాన్, షాహిద్, కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ దొరబాబు, ఓ. మధుసూదన్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# "మొంథా" తుఫాను పట్ల ఎలాంటి భయాందోళన అవసరం లేదు..!

### జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంది

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి/పెన్ పవర్/అక్టోబర్ 27 :**

"మొంథా " తుఫాను వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం కానీ, ఆస్తి నష్టం కానీ వాటిల్లే అవకాశం లేకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన సహాయక చర్యలు అందించేందుకు అప్రమత్తంగా ఉందని. తుఫాను పట్ల భయభ్రాంతులను చేసే పుకార్లను నమ్మకుండా.. ప్రశాంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సోమవారం ఒక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు సూచించారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో "మొంథా"తుఫాన్ ప్రభావం తిరుపతి జిల్లాకు కూడా ఉండడంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రాష్ట్ర వాతావరణ విపత్తుల నియంత్రణ శాఖ రెడ్ అలెర్ట్ ను ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తూ.. పలు హెచ్చరికలను కూడా జారీ చేశారు. తుపాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..!. ప్రధానంగా పలు సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దు, ప్రశాంతంగా ఉండండి, భయాందోళన అవసరం లేదు. అత్యవసర కమ్యూనికేషన్ కోసం మీ మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసుకుంటూ ఉండండి, వాతావరణ హెచ్చరికలు కోసం లను గమనిస్తూ ఉండండి. మీ భద్రత మరియు మనుగడ కోసం అవసరమైన వస్తువులతో "అత్యవసర వస్తు సామగ్రిని" సిద్ధం చేసుకోండి. ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్ళండి. మీ పత్రాలు/సర్టిఫికెట్స్ మరియు విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ కంటైనర్లు/కవర్ లో ఉంచండి. ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయండి, అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలు మరియు గ్యాస్ కనెక్షలను తీసివేయండి. తలుపులు మరియు కిటికీలు మూసి ఉంచండి. మీ ఇల్లు సురక్షితం కాకపోతే, తుపాను ప్రారంభం కాకముందే సురక్షితమైన ఆశ్రయం/షెల్టర్ కు చేరుకోండి. పాత భవనాలు, చెట్లు, విద్యుత్ వైర్లు స్తంభాల కింద ఎప్పుడూ ఉండకండి. పశువులు, పెంపుడు జంతువులకు కట్టిన తాడును విప్పి వాటిని వదిలివేయండిజ మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళకండి. అత్యవసర సహాయ సమాచారం నిమిత్తం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంతో పాటు తిరుపతి, శ్రీకాళహస్తి,గూడూరు, సూళ్ళూరు పేట ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, తిరుపతి కంట్రోల్ రూమ్ : 0877-2236007

ఆర్డీవో కార్యాలయం, తిరుపతి : 7032157040

ఆర్డీవో కార్యాలయం, శ్రీ కాళహస్తి: 8555003504

ఆర్డీవో కార్యాలయం, గూడూరు : 08624-252807,8500008279

ఆర్డీవో కార్యాలయం, సూళ్ళూరుపేట : 08623295345

అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణలో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నెంబర్లు : 112, 1070, 1800 425 0101 లకు కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.

# మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పూదూరు లక్ష్మణ్ రెడ్డి అనారోగ్యంతో మృతి.





**శ్రీకాళహస్తి , ప్రభ న్యూస్ ,ఆర్ సి ఇన్చార్జ్ :**

శ్రీకాళహస్తి బిపి అగ్రహారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుదూరు లక్ష్మణ్ రెడ్డి అనారోగ్యంతో మరణించినారు పార్థివ దేహానికి;;శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి మరియు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పూలమాలవేసి నివాళు లర్పించిన.అనంతరం;వారి కుటుంబ కిసభ్యున్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియచేసారు.జ సంతాపం తెలిపిన వారిలో రత్నం రెడ్డి, ఆర్కాట్ శంకర్, ఆర్కార్డు ముత్తు, అడ్వకేట్ లక్ష్మీపతి, సోమిరెడ్డి భరత్ రెడ్డి, కంట ఉదయ్ కుమార్, సాధన మున్నా రాయల్, కంచి గురవయ్య, బాల గౌడ్, జీవీకే రెడ్డి తదితరులు సంతాపం తెలియజేశారు.

# మునిసిపల్ డెస్క్ ఏర్పాటు.. కమిషనర్ డి. బాలకృష్ణ..

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ అక్టోబర్ 27**

బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘం పరిధిలోగల ప్రజలకు మంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా ప్రజలకు సహాయం అందించుటకు హెల్ప్ లైన్ డస్క్ ఏర్పాటు చేయడం జరిగింది. సోమవారం మీడియా సమావేశంలో కమిషనర్ డి బాలకృష్ణ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేశామని ఎవరైనా తుఫాన్ కారణంగా పారిశుధ్య, నీరు, విద్యుత్, అంతరాయము కలిగినచో ఈ హెల్ప్ లైన్ డెస్క్ కు ఫోన్ చేసి తక్షణ సహాయ సహకారాలు పొందగలరని కోరుచున్నాను. 9493379985, 9502170961, 8500133249 మరియు 9573042185 పై నెంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు.



# శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ అక్టోబర్ 27**

కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ఉదయం శ్రీ స్వామి వారి మూలవర్లు కు ఆలయ అర్చకులు వేద పండితుల మంత్రాచ్చారణతో అన్నాభిషేకం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేక కార్యక్రమాన్ని తిలకించారు. జొన్నవాడ వాస్తవ్యులు శ్రీ బుర్లా కుమార్ ప్రసాద్ రెడ్డి శ్రీమతి మాధురి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థాన చైర్మన్ శ్రీ తిరుమూరు అశోక్ రెడ్డి గారు, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పాలక మండలి సభ్యులు భక్తులకు దర్శన క్యూలైన్లు, ఉచిత ప్రసాద వితరణ, అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ శ్రీ తిరుమూరు అశోక్ రెడ్డి పాలక మండలి సభ్యులు శ్రీ నక్కల శివకృష్ణ శ్రీ మతి పొన్నత్తూరు సుమలత శ్రీమతి జొన్నలగడ్డ వరలక్ష్మి శ్రీమతి పాలూరు చాముండేశ్వరి గారు, శ్రీ కీలుకుప్ప శ్రీనివాసులు , శ్రీమతి సూరాయపాలెం ప్రత్యూష శ్రీ ముంగర సుధాకర్ ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఉదయం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు, పాలాభిషేకములు జరిపించారు. సాయంత్రం చిన్న వెండి నంది వాహనం పై శ్రీ స్వామి వారు పల్లకి సేవ ప్రాకారోత్సవం లో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమూరు అశోక్ రెడ్డి చైర్మన్ మరియు ధర్మకర్త మండల సభ్యులు అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి.

# ప్రధమ వార్షికోత్సవము జయప్రదం చేయండి..

### బిసి ఐక్యత భవన్ నేతలు.

**కావలి: పెన్ పవర్ -(ఆర్సి ఇంచార్జ్ )అక్టోబర్ 27**

బిసి ఐక్యత భవన్ ప్రథమ వార్షికోత్సవమును బిసిలు తోపాటు బడుగు బలహీన, మైనారిటీ వర్గాలు పాల్గొని జయప్రదం చేయాలని బిసి ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకరరావు, గౌరవాధ్యక్షులు ఉరిటి గోవిందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయుడు పరిశుద్ధ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కోడింగారి శ్రీను పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని స్థానిక జర్నలిస్టు క్లబ్ నందు వారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు ట్రంకు రోడ్డు లోని హీరో షోరూం పక్కన ఈడెన్ ఫంక్షన్ హాల్ నందు బిసి ఐక్యత భవన్ ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే




కావ్య కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, జెట్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ మరికొంతమంది బిసి ప్రముఖ నేతలు పాల్గొంటున్నారని తెలిపారు .ఈ కార్యక్రమానికి బిసి నేతలతో పాటు బిసి సోదరులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు, మైనారిటీ సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలానే ఈ సమావేశంలో రాష్ట్రంలో బిసిల జనాభా శాతం 52% పైపెచ్చు ఉన్నా బిసిల పట్ల రాజకీయపార్టీలు వివక్షత చూపుతున్నాయని తెలిపారు అలానే బిసిలు ఎదుర్కుంటున్న సమస్యలు,కులగణన, రాజకీయాల్లో బిసిల వాటా తదితర అంశాలపై చర్చించటం జరుగుతుందన్నారు. నూతన కమిటీలను కూడా ఎన్నుకోవటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి ఐక్యతా భవన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిన్ని వర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# నేనున్నానని...

## అభాగ్యురాలికి డా.కోటేశ్వరబాబు అపన్నహస్తం

### నిత్యావసర సరుకుల పంపిణీ







**శ్రీకాళహస్తి పెన్ పవర్ అక్టోబర్ 27**

తెల్లారి లేస్తే ఎన్నో దృశ్యాలు మన కంటపడుతుంటాయి. వాటిలో కొన్ని కదిలిస్తాయి.. అయ్యో అనుకునేలా చేస్తాయి. ఈ కోవలోనే ఓ అభాగ్యురాలి దీనస్థితి తెలిసి చలించిపోయారు ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు. ఆ అభాగ్యురాలికి అపన్నహస్తం అందించారు. శ్రీకాళహస్తి మండలంలోని వేలవేడు ఎస్సీ కాలనీకి చెందిన వృద్దురాలు సవితమ్మ(65) ఒంటరిగా ఓ పూరిగుడిసెలో జీవనం సాగిస్తోంది. నెలనెలా వచ్చే ఫించనే ఆమెకు జీవనాధారం. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి గోడలు నాని పూరి గుడి సె కూలిపోయింది. తలదాచుకునే అవకాశం లేక సమీపంలోని ఓ మూత్రశాల గదిలో ఉంటూ బిక్కుబిక్కుమంటూ కాలం వెలదీస్తోంది. ఈ క్రమంలో ధీనస్థితిని తెలుసుకుని చలించినపోయిన కోటేశ్వరబాబు తనవంతు సాయం అందించాలని సంకల్పించారు. అనుకున్నదే తడువుగా సోమవారం ఆ గ్రామానికి వెళ్లి ఆమె యొక్క యోగా క్షేమాలు తెలుసుకొని ఒక బియ్యం బస్తా, నెలరోజులకుపైగా సరిపోయే నిత్యావసర సరుకులతోపాటు కూరగాయలు ఆమెకు అందించారు. అలాగే పౌష్టిక విలువలతో కూడిన భోజనాన్ని అందించి ఖర్చులకు కొంత నగదును ఇచ్చారు. కూలిపోయిన ఇంటి పునర్నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఆ వృద్ధురాలికి అభయమిచ్చారు. గత 15 సంవత్సరాలకుపైగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్తున్న కోటేశ్వరబాబు దాతృత్వాన్ని పలువురు ప్రశంసించారు.

## కలెక్టర్ నోట పొన్నాల కాలువ మాట




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 27**

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఈరోజు కర్లపాలెం మండలం నర్రావారిపాలెం పరిధి లో ఉన్న పొన్నాల కాలువ విషయం పై మాట్లాడారు. అత్యధిక వర్షపాతం నమోదు కానున్నందున పొన్నాల కాలువ పొంగిపొర్లే అవకాశం ఉందని కనుక దీనిపై ప్రయాణాలు పూర్తిగా నిషేధం అన్నారు. అంతే కాకుండా పొన్నాల కాలువ ఆక్రమణలు కూడా తొలగించేలాగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జాకీర్ పాష పొన్నాల కాలువను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ, శ్రీనివాస రావు వీఆర్వో సుధాకర్ పంచాయతీ కార్యదర్శి దివ్య తదితరులు ఉన్నారు.కర్లపాలెం ఎస్. ఐ రవీంద్ర పొన్నాల కాలువ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం మీద పొన్నాల కాలువకు నూతన వంతెనతో పాటు ఆక్రమణలు కూడా విరిగిపోయే రోజులు రానున్నాయి.

## రాబోవు తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, పునరావాస కేంద్రాలకు వెళ్లాలి



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 27**

ప్రభుత్వ హెచ్చరికలను పాటిస్తూ లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారు పునరావస కేంద్రాలకు వెళ్లాలని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసు రావు అన్నారు సోమవారం ఆయన, రెడ్ క్రాస్ ప్రతినిధులు మండల పరిధిలో ఉన్న లోతట్టు ప్రాంతాలలో సందర్శించి వారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారికి ఆహార పదార్థాలు అందించారు. మరియు ఆయన మాట్లాడుతూ ఈ రెండు రోజులు ప్రజలు ప్రయాణాలు చేయవద్దని ఆహార పదార్థాలు, త్రాగునీటిని జాగ్రత్తపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి మందపాటి పరమానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారితో మాట్లాడుతున్న రెడ్ క్రాస్ పోలీసు రావు, పరమానంద కుమార్.

## తొలి కార్తీక సోమవారం శోభ....

### శివనామ స్మరణతో మారుమోగిన ఆలయాలు...





**సీతారామపురం పెన్ పవర్డఅక్టోబర్ 27**


కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా సీతారాంపురం మండలంలోని శైవ క్షేత్రాలలో మరియు ఆలయాలలో తెల్లవారుజాము నుంచే దీపాలు వెలిగించి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం సాయంత్రం సీతారాంపురంలోని ఆలయంలో మహిళలు భక్తి శ్రద్దలతో పిండి దీపాలు. ప్రమిదలు వెలిగించి. స్వామివారికి అభిషేకాలు జరిపించి తమ మొక్కలు తీర్చుకున్నారు. శివనామ స్మరణముతో ఆలయం మారుమోగిపోయింది. తరువాత తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఆర్టీసీ బస్ స్టేషన్ స్థలం పరిశీలన...

### ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపు రెడ్డి సురేష్ రెడ్డి

**సీతారామపురం పెన్ పవర్ అక్టోబర్ 27**

సీతారామపురం మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్ స్టేషన్ ను నెల్లూరు ఆర్టిసి జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి సోమవారం పరిశీలించారు. సీతారామపురం లో దశాబ్దాల కాలం నుండి ఆర్టీసీ బస్ స్టేషన్ నిరుపయోగంగా ఉందని తెలియడంతో పరిశీలించేందుకు వచ్చామన్నారు. స్థానిక నాయకులు, ప్రజల సహకారంతో నిరుపయోగంగా ఉన్న బస్ స్టేషన్ ను అన్ని విధాల అభివృద్ధి చేసి వాడుకలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. సీతారామపురం మీదుగా కడప జిల్లా ప్రకాశం జిల్లాలకు అత్యధికంగా ప్రయాణాలు జరుగుతున్నాయని, నూతనంగా గ్రీన్ఫీల్డ్ హైవే 167 బి జాతీయ రహదారులు ఏర్పడిన తర్వాత ప్రయాణాలు ఎక్కువ అయ్యాయన్నారు. ఆర్టీసీకి చెందిన సుమారు రెండు ఎకరాలకు పైగా ఖాళీ స్థలం కూడా నిరుపయోగంగా ఉందని దానిని ఉపయోగించుకునేందుకు చర్యలు చేపడతామన్నారు. బస్ స్టేషన్ లో మరుగుదొడ్లు, విద్యుత్తు, మంచినీటి సౌకర్యాలను కల్పించి అతి త్వరలోనే సీతారామపురం బస్ స్టేషన్ కు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం ద్వారా రోజు లక్షలాదిమంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని, ప్రభుత్వ సహకారంతో రాబోయే రోజుల్లో సుమారు 1500 బస్సులను ఆర్టీసీ యాజమాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. సుమారు 1350 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరడంతో ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే




అనుమతులు ఇచ్చారన్నారు. ప్రైవేటు బస్సుల యాజమాన్యాల దోపిడీని అరికట్టేందుకు ఆర్టీసీ బస్సులు ప్రాముఖ్యత అవసరమన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణం భద్రత, సురక్షితంగా గమ్యాలకు చేరే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో . ముత్తం శెట్టి చెన్నకేశవులు.సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్, బిజెపి జిల్లా కిసాన్ మోర్చా మాజీ ఉపాధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు గేట్టిబోయిన వెంకటేశ్వర్లు తోట ఏడుకొండలు. తదితరులు పాల్గొన్నారు.

## మణికేశ్వరంలో కార్తీకమాసం మొదటి వారం పూజలు





**పెన్ పవర్, అక్టోబర్ 27,అద్దంకి**

నియోజకవర్గంలోని అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామం లో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం మొదటి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం వేకువ జామునుంచే భక్తులు ఆలయానికి క్యూ కట్టారు. శివమాలధారులు,అయ్యప్ప స్వాములు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామ టీడీపీ నేతలు కరిముల్లా,అంజయ్య,అశోక్, ఈవో వాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రం.... ప్రజలు బయటకు రావొద్దు

### పెళ్లకూరు ఎస్సై కె. నాగరాజు హెచ్చరిక

### మండల పరిధిలో పోలీసులు ముమ్మర పర్యవేక్షణ


### అవసరం లేకుండా రోడ్లపైకి రావద్దని సూచన

**పెళ్లకూరు, పెన్ పవర్, అక్టోబర్ 27**



పెళ్లకూరు మండల పరిధిలో తుఫాన్ 'మొంథా' ప్రభావం కారణంగా భారీ గాలులు, వర్షాలు కొనసాగుతాయి అనే నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె. నాగరాజు సూచించారు. మండలంలో స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తునడంతో నదీ పరివాహ గ్రామాల ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై కె. నాగరాజు మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రత మాకెప్పుడూ మొదటి ప్రాధాన్యం. అవసరం లేకుండా ఎవరూ బయటకు రావొద్దు. అత్యవసరమైన పని ఉన్నా జాగ్రత్తగా ప్రయాణించాలి అని అన్నారు. తుఫాన్ సమయంలో విద్యుత్ తీగలు, చెట్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున వాటి సమీపానికి వెళ్లరాదు అని హెచ్చరించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పోలీసు సిబ్బంది సూచనలు అందజేస్తూ అవసరమైతే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వర్షపు నీటిలో వాహనాలు నడపకూడదని, ప్రత్యేకించి మద్యం తాగి వాహనం నడిపేవారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావం కొనసాగుతున్నంత కాలం మండలంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు జాగ్రత్తగా ఉంటేనే ప్రమాదాలను నివారించగలం అని ఎస్సై నాగరాజు అన్నారు. ముఖ్యంగా నీటి గుంటల దగ్గరికి కాలువల దగ్గరికి ప్రవాహాల దగ్గరికి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకూడదని హెచ్చరికలు చేశారు.

## పలు సమస్యల పై వినతి పత్రం అందించిన బి.జె.పి నాయకులు.



**కావలి: పెన్ పవర్-( ఆర్సీ ఇంచార్జ్ )అక్టోబర్ 27**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశానుసారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కావలి ఒకటోవ పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన జనతా వారధి కార్యక్రమంలో భాగంగా ఆర్డిఓ కు పట్టణంలోనీ పలు సమస్యలపై సోమవారం వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనతా వారధి కార్యక్రమంలో భాగంగా కావలి పట్టణంలోని పలు సమస్యలపై వినతి పత్రం అందించడం జరిగింది అన్నారు. అందులో ముఖ్యంగా కావలి ఒకటోవ వార్డు మద్దురపాడులో ఉన్నటువంటి టిడ్కో గృహాలలో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో టీడ్కో గృహాల్లో నివసించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడ్కో ఇళ్ల చుట్టూ ప్రహరీ గోడను ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. టిడ్కో గృహాల పరిసరాలు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో తగినన్ని ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటు చేయాలని, తుఫాను విపత్కర సమయంలో మెరుగైన సేవలు అందించాలని కోరారు. మెంథా తుఫాన్ తీవ్రతను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వ అధికారులు ప్రజలకు తగు సూచనలు చేయాలని, విపత్కర పరిస్థితిలో ప్రజలకు అధికారులు అండగా ఉండాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని బాలకృష్ణారెడ్డి నగర్, ఇందిరమ్మ కాలనీ, ముసునూరు తదితర ప్రాంతాలలో తరచూ విద్యుత్ కోతలు జరుగుతున్నాయని, మెరుగైన విద్యుత్ అందించేందుకు కృషి చేయాలని కోరారు. మెంథా తుఫాన్ ముంచుకొస్తున్న వేళ పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ అధికారులు చేసే సూచనలు తూచా తప్పకుండా పాటించాలని భారతీయ జనతా పార్టీ కావలి పట్టణ శాఖ కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకోశాధికారి కందుకూరి వెంకట సత్యనారాయణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ మాల్యాద్రి, జిల్లా కోశాధికారి సీవీసీ సత్యం, పట్టణ ప్రధాన కార్యదర్శి గుడిపల్లి ప్రసన్నకుమార్, పట్టణ ఉపాధ్యక్షులు కోడూరు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను నేపథ్యంలో ప్రయాణాలు రద్దు చేసుకోవాలని ప్రజలకు మాజీ మంత్రి విడదల రజని విజ్ఞప్తి

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 27**



చిలకలూరిపేట: నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి విడదల రజని ముఖ్య విన్నపం చేశారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఈనెల 27, 28, 29వ తేదీలలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వారి వారి ప్రయాణాలను మూడు రోజుల పాటు రద్దు చేసుకోవాలని ఆమె సూచించారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ముఖ్యంగా చిన్న పిల్లలను బయటికి పంపవద్దని ఆమె తెలిపారు.ఈ క్లిష్ట పరిస్థితులలో నియోజకవర్గంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) శ్రేణులు పార్టీలకు అతీతంగా అవసరమైన వారికి సహాయం అందించాలని ఆమె తెలియజేశారు. ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వ, వాతావరణ శాఖ హెచ్చరికలను పాటించాలని ఆమె కోరారు.

# విపత్తును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం ఆర్డీవో గ్లోరియా






**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 27**

తుఫాన్ కారణంగా అధికంగా వర్షాలు,గాలులు వీచే అవకాశం ఉన్న తరుణంలో ఎక్కడ ఇబ్బందులు లేకుండా ఆర్డీఓ గ్లోరియా, తహసిల్దార్ షలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. పిపి యూనిట్ లలో మందులు అందుబాటులో ఉంచడంతో పాటు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని ఆర్డీఓ గ్లోరియా అన్నారు. అధికంగా గాలులు వీచి రోడ్లపై చెట్లు పడిపోతే తక్షణమే చెట్లను తొలగించడానికి సిబ్బందిని సిద్ధం చేశామని, ఎక్కడ ఎటువంటి అపాయాలు, కలగకుండా సమస్యలు లేకుండా ప్రాణ,ఆస్తి నష్టం కలగకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్న జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సమాచారం అందించాలని సమస్యలు పరిష్కరించే విధంగా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని వివరించారు.

# సాతులూరి కోటి కుమార్తె వివాహ నిశ్చయ తాంబూలాలు

### ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 27**

పట్టణ యువజన నాయకులు సాతులూరి కోటి - దేవి కుమారిల కుమార్తె సుమ, సంపత్ వెస్లీల వివాహ నిశ్చయ తాంబూలాల వేడుక వారి స్వగృహం నందు వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, సోమేపల్లి వెంకటసుబ్బయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.నవ వధూవరులు సుమ - సంపత్ వెస్లీలను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన వధూవరులు జీవితంలో సుఖ సంతోషాలతో, ఉన్నత స్థానంలో ఉండాలని భగవంతుడిని కోరుకుంటున్నానని ఆశీర్వదించారు. ఈ వేడుకలో మర్రి రాజశేఖర్ వెంట గేరా లింకన్, బైరా వెంకట కోటి, ఏవీఎం సుభాని, ఇమ్మడి జానకిపతి, షేక్ కాలేషా (మాజీ కౌన్సిలర్), హిదాయితుల్లా, షేక్ మస్తాన్ (జనరేటర్), యూత్ జిలాని, రావూరి దాసు, దార్ల ఏలియా, చుక్కా డేవిడ్, అత్తలూరి షరీఫ్, దాసు, కొప్పుల రత్నకుమార్, కొప్పుల దినకర్, లింగాల విజయ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ హెచ్చరిక

## చిలకలూరిపేట పట్టణ ప్రజలకు పురపాలక సంఘం కీలక విజ్ఞప్తి

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 27:**



తుఫాన్ ప్రభావంతో ఈ రోజు (27.10.2025) రాత్రి నుండి చిలకలూరిపేట పట్టణంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిలకలూరిపేట పురపాలక సంఘం విజ్ఞప్తి చేసింది. అత్యవసరమైతే తప్ప ఎవరూ కూడా బయటకు రాకూడదని మరియు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కమీషనర్ కోరారు.

**ప్రజలు పాటించాల్సిన సూచనలు:** విద్యుత్ వస్తువులను, ఎలక్ట్రికల్ పోల్స్, నీటిలో ఉన్న కరెంట్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకరాదు, వాటికి దూరంగా ఉండాలి, చిన్న పిల్లలను నీటిలో ఆడుకోవడానికి పంపకూడదు, మంచినీటిని కాచి, చల్లార్చిన తర్వాత మాత్రమే త్రాగాలి. పరిసరాలలో వర్షం కారణంగా చెట్లు పడిపోవడం లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు జరిగిన యెడల, వెంటనే మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెం: 08647-253994 నకు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

**లోతట్టు ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక విజ్ఞప్తి..బీ** సంజీవ్ నగర్, శాంతి నగర్, సుబ్బయ్య తోట, ఈస్ట్ మలపల్లె, శారద హై స్కూల్ రోడ్ వంటి లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. భారీ వర్షాల వలన అత్యవసర పరిస్థితులు ఏర్పడినచో, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి పురపాలక సంఘం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుంది.

**పునరావాస కేంద్రాలు :** సుగాలీ కాలనీ హైస్కూల్ , ఆర్ వి ఎస్ సి వి ఎస్ హైస్కూల్ , మద్దినగర్ కమ్యూనిటి హాల్, జి ఆర్ జూనియర్ కాలేజీ, పెద్దనందిపాడు రోడ్ లోతట్టు ప్రాంతాల ప్రజలు తరలింపునకు సిద్ధంగా ఉండాలని కమీషనర్ ఈ సందర్భంగా కోరారు.

# కిడ్నాప్ కు గురైన మూడు సం.రాల బాబును కేవలం గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పాత గుంటూరు పోలీసులు

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 27**

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు వేగంగా స్పందించి, బిడ్డను కనిపెట్టి,రక్షించి తల్లిదండ్రులకు అప్పగించిన పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ , ఎస్సై ప్రసాద్ , వారి సిబ్బంది.

పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్.షాఫిఉల్లా అనే అతను నిన్న(ది.26.10.2025) మద్యాహ్నం సుమారు 01:00 గంట నుండి తన మూడు(03) సంవత్సరాల బాబు కనిపించడం లేదని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, వెంటనే సీఐ వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో సీర్.నా. 319/2025 యూ/స 140(2) బన్స్ అఫ్ ఓల్డ్ గుంటూరు సెక్షన్ కింద కిడ్నాప్ కేసు నమోదు చేసి, సదరు విషయాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కి తెలియపరచి, ఆయన ఈ కేసుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, తక్షణమే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మర గాలింపు చేపట్టాలని ఆదేశించగా, కేసు దర్యాప్తు చేపట్టడం జరిగింది.

ఈ దర్యాప్తులో ఫిర్యాది వదిన(మేనత్త కూతురు) అయిన పటాన్ షకీలా తనకి వున్న కుటుంబ సమస్యల వలన గత వారం నుండి ఫిర్యాది వాళ్ళ నాన్న గారి ఇంట్లో ఉంటుంది.ఈ క్రమంలో తనకి ఉన్న అప్పుల నుండి బయటపడటానికి బాబుని కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేద్దామనే దురుద్దేశంతో ఎవరికీ చెప్పకుండా బాబుని తీసుకొని వెళ్ళిపోయి చెన్నైలో వున్న తన అన్న అయిన షైక్ సాహిదుల్ల కి ఫోన్ చేసి నాకు 6 లక్షలు ఇస్తేనే బాబుని వాళ్ళకి ఇస్తాను. లేకపోతే చంపేస్తాను అని బెదిరించగా వెంటనే అతను ఆ విషయాన్ని ఫిర్యాదికి తెలియ చేయగా అతను వెంటనే



పాత గుంటూరు పోలీస్ వారికి తెలియపరచడం జరిగింది.సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బాబుని కిడ్నాప్ చేసినాహులను ఈ రోజు ఉదయం 08.00 గంటలకి గుంటూరు బస్టాండ్ వద్ద అరెస్ట్ చేసి ఆమె వద్ద నుండి బాబుని సురక్షితంగా రక్షించి, అతని తల్లిదండ్రులకు అప్పగించడమైనది.నిందితురాలైన షకీలాని రిమాండ్ నిమిత్తం కోర్ట్ కి హాజరుపరచడమైంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...జ సకాలంలో పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్ల త్వరితగతిన చర్యలు తీసుకోగలిగామని, తల్లిదండ్రులు తమ పిల్లల భద్రత పట్ల జాగ్రత్త వహించాలని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత మరియు గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా మీ పిల్లలను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తమ బిడ్డ అపహరణకు గురైన వెంటనే ఆందోళనతో, భయంతో ఉన్న



సమయంలో కేవలం గంటల వ్యవధిలోనే వారి బాబునీ తల్లి దండ్రులు రక్షించి,అప్పగించారని పాత గుంటూరు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో పాత గుంటూరు పోలీసులు చూపిన ప్రత్యేక చొరవ, చేసిన ప్రయత్నాలు వెలకట్టలేనివని, మా బిడ్డను సురక్షితంగా రక్షించిన పోలీసు శాఖకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామని తల్లిదండ్రులు పేర్కొన్నారు. బాబును రక్షించుటలో అత్యంత ప్రతిభ కనపరిచిన ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్ ని, పాత గుంటూరు సిఐ-కె.వెంకట ప్రసాద్ ని , యస్.ఐ-యన్.సి. ప్రసాద్ మరియు సిబ్బంది హెచ్ సి నూరుద్దీన్ ,పీసీ రాజశేఖర్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినారు.

# ఆ 'దండగ' పనులే నేడు 'మా గొప్ప'లా? వైఎస్ జగన్మోహన్ రెడ్డి'యూ-టర్న్' రాజకీయం!

### -రాచకొండ లక్ష్మయ్య..

**పెన్ పవర్ గుంటూరు, అక్టోబర్, 27**

కాళేశ్వరం వర్సెస్ పట్టిసీమ. పట్టిసీమ: మొదట దండగ దోచుకోవడానికి" అని విమర్శించడం. పూర్తయ్యాక: తమ తండ్రి తవ్విన కాలువల వల్లే నీళ్లు వచ్చాయని మాట మార్చడం. కియా పరిశ్రమ: గతంలో: దండగ", భూములు వెనక్కి తీసుకుంటా" అని విమర్శించడం. ప్రస్తుతం: తమ తండ్రి వల్లే వచ్చిందని మాట మార్చడం. శాసనమండలి (కౌన్సిల్): టీడీపీ మెజారిటీ ఉన్నప్పుడు: మండలి దండగ అని విమర్శించడం. ప్రస్తుతం: ప్రజాస్వామ్యంలో కీలకం అని మాట్లాడటం. హైటెక్ సిటీ/ఐటీ అభివృద్ధి (వైఎస్ - జగన్మోహన్ రెడ్డి): తండ్రి (వై.ఎస్.ఆర్.): అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కట్టిన హైటెక్ సిటీని విమర్శించడం, కంప్యూటర్లు కూడు పెడతాయా అనడం. కొడుకు (జగన్): ప్రస్తుతం తమ తండ్రి వల్లే ఐటీ వచ్చిందని చెప్పుకోవడం.

**రాజధాని - అమరావతి:**

గెలవక ముందు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కన్నా వేగంగా కడతా, మధ్యలోనే ఉండాలి అని చెప్పడం. గెలిచాక: అమరావతిని నాశనం చేయడం (వికేంద్రీకరణ). తాజాగా: సి ఆర్ డి ఏ భవనం గురించి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసినా, తాను 80% పూర్తి చేశానని ఫేక్ ప్రచారం చేసుకోవడం.

**భోగాపురం ఎయిర్‌పోర్ట్:** గతంలో: "దండగ", దగ్గర్లో వైజాగ్ ఎయిర్‌పోర్ట్ ఉంది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బినామీల కోసం అని విమర్శించడం. ప్రస్తుతం/భవిష్యత్తు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తి చేశాక, తానే కట్టానని చెప్పుకోవడానికి సిద్ధపడటం. అదానీ డేటా సెంటర్ (వైజాగ్ ) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెచ్చినప్పుడు: గూగుల్ తెచ్చాడు", కాలుష్యం కరెంట్/నీళ్లు దండగ", "గోడౌన్", భూమి దండగ అని వ్యతిరేక ఫేక్ ప్రచారం చేయడం జరిగిందని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు. ప్రస్తుతం మాట మార్చడం: అదానీ, గూగుల్ నేనే తెచ్చానని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫేక్ ప్రచారం చెప్పుకోవడం.

**మెడికల్ కాలేజీలు - పీపీపీ విధానం:** ప్రచారం: కొద్దిపాటి ఖర్చుతో 17 కాలేజీలు కట్టేశానని ఫేక్ ప్రచారం చేసుకోవడం. పీపీపీ విధానంపై దుష్ప్రచారం: పేదలకు సీట్లు/వైద్యం అందించేలా పీపీపీ విధానంలో పూర్తి చేస్తుంటే, దానిపై విమర్శలు చేయడం.

**వివేకా హత్య కేసు: నేరారోపణ:** హత్య చేసి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పై పులివెందుల ఇన్చార్జి బీటెక్ రవి పై మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి పై ,చివరకు సునీత మీద నెట్టే ప్రయత్నం చేశాడు కానీ ప్రజలు ఆ నేర ప్రవృత్తిని గ్రహించి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా కూర్చోబెట్టారు అయిన కూడా అవే అబద్ధాలు అవే కుట్రలు చేస్తున్నారు వైసిపి నాయకులు ఈ దుర్మార్గమైన చర్య దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు.

# పార్టీ విజయాలు, నాయకుల ప్రగతికి కార్యకర్తలే పునాది -మంత్రి గొట్టిపాటి రవి కుమార్

### కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయకర్తగా మంత్రి లోకేశ్ సేవలు ప్రశంసనీయం






**పెన్ పవర్, అక్టోబర్ 27,అద్దంకి**

కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయకర్తగా నారా లోకేశ్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని జే పంగులూరు మండలంలోని ముప్పవరం గ్రామం లో వున్న టిడిపి పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంపిణీ చేశారు. మొత్తం 78 మంది లబ్ధిదారులకు 45 లక్షల రూపాయలు విలువైన చెక్కులను మంత్రి అందించారు . అనంతరం ముగ్గురు పార్టీ కార్యకర్తల కుటుంబాలకు కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ, దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం పట్ల పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు. పార్టీ విజయాలు, నాయకుల ప్రగతికి కార్యకర్తలే పునాది అన్నారు. అందుకే వారి సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుంది అని మంత్రి రవికుమార్ అన్నారు. కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా చనిపోయిన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని, ఇది పార్టీ కార్యకర్తల కుటుంబాలు పట్ల పార్టీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమ నిధిని రూపొందించి అమలు చేయించిన మంత్రి నారా లోకేశ్ గారి సేవలు ప్రశంసనీయమని రవి కుమార్ కొనియాడారు. లోకేశ్ దూరదృష్టితోనే ఈ నిధి ద్వారా కార్యకర్తల కుటుంబాలు భద్రతను పొందుతున్నాయన్నారు . పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉండే తీరునే తెలుగుదేశం పార్టీని ప్రత్యేకంగా నిలబెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులను సత్కరించిన బీసీ సంక్షేమ సంఘం నేతలు

**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్) అక్టోబర్ 27**

మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత,డిప్యూటీ సూపరింటెండెంట్ భానుమూర్తి, ఆర్.ఎం.ఓ నిరంజన్ లను కృష్ణాజిల్లా బీ.సీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. గతంలో బీ.సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం ఎం.ఆర్.ఐ స్కానింగ్ విభాగంలో రోగి రోగికి వ్యత్యాసం చూపిస్తూ ధరలు వసూలు చేయడం, నగదు జమ చేయించుకుని రసీదులు ఇవ్వకపోవడం,బ్లడ్ శాంపిల్ కలెక్షన్ కు టోర్నీ కిట్లు వాడకపోవడం వంటి సమస్యలపై డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్.ఎం.ఓ లకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. పైన తెలిపిన సమస్యలపై సత్వర చర్యల్లో భాగంగా వెంటనే ఎం.ఆర్.ఐ స్కానింగ్ ధరలు పట్టికను సంబంధిత విభాగం వద్ద ఏర్పాటు చేయడం. నగదు జమకు రసీదులు అందజేయడం జరిగినది. రక్త సేకరణకు టోర్నీ కిట్లను అందజేయడం వంటి చర్యలను సత్వరమే తీసుకుని సమస్యలను పరిష్కరించినందుకు సుబ్రమణ్యం కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సూపర్ ఇంటెండెంట్,డిప్యూటీ సూపర్ ఇంటెండెంట్, ఆర్. ఎం.ఓ లను పుష్ప



గుచ్చాలు, దుశాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జన్ను గోవిందు, భోగి రెడ్డి సుభాని, నిక్కు రాధాకృష్ణ, ధనికొండ చిన్ని, ఎం. రామరాజు, ఎం.గోపి, రత్తయ్య తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ జిల్లా రైతు విభాగం కమిటీలో వెల్లలచెరువు గ్రామానికి చెందిన కేసరి చెన్నారెడ్డికి చోటు



**పెన్ పవర్, అక్టోబర్ 27,అద్దంకి :**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు బాపట్ల జిల్లా వైఎస్ఆర్సీపీ రైతు విభాగం కమిటీలోకి అద్దంకి నియోజకవర్గం పరిధిలోని సంతమాగులూరు మండలం నేతలకు చోటు దక్కింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉప్పె పూర్ణచంద్ర రావు, ప్రధాన కార్యదర్శి కొత్త పోలిరెడ్డి, కార్యదర్శి ధూళిపాళ్ల నాగేశ్వరరావు, కార్యనిర్వహక సభ్యులుగా మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన కేసరి చెన్నారెడ్డి ని అడుసుమల్లి బాలమురళీకృష్ణ లు ఎంపికయ్యారు. ఈసందర్భంగా పదవులు పొందిన వారు అద్దంకి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా పార్టీ శ్రేణులు పలువురు రైతు విభాగం కమిటీ నూతన సభ్యులను అభినందించారు.

# తుఫాన్ ప్రభావం భయాందోళనలో తీరప్రాంత ప్రజలు

### పోలీసులు అండగా నిలిచారు

### - వేటపాలెం మండలంలో సహాయక చర్యలు వేగంగా





**వేటపాలెం, పెన్ పవర్ ,అక్టోబర్ 27**

తుఫాన్ ప్రభావంతో వేటపాలెం మండలంలోని తీరప్రాంత గ్రామ ప్రజలకు అండగా పోలీసులు నిలిచారు. డీఎస్పీ మహమ్మద్ మోయిన్ ఆదేశాల మేరకు, రూరల్ సీఐ శేషగిరిరావు పర్యవేక్షణలో వేటపాలెం ఎస్సై జనార్ధన్ సిబ్బందితో కలిసి తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని కటారివారిపాలెం ఎస్టీ కాలనీలో నీటిలో చిక్కుకున్న పలువురు కుటుంబాలను పోలీసులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తరలించిన వారికి ఆహారం, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రజల ప్రాణాలు అత్యంత ముఖ్యమని ఎస్సై జనార్ధన్ తెలిపారు. తుఫాన్ పూర్తిగా తగ్గే వరకు గ్రామాల్లో గస్తీ కొనసాగిస్తామని తెలిపారు. ప్రజల భద్రత కోసం స్థానిక పోలీసు బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, ఏవైనా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.

## కోహ్లీ, రోహిత్ మళ్ళీ గ్రౌండ్‌లో కనిపించేది అప్పుడే .. 2027 వరల్డ్ కప్ ముందు టీమిండియా వన్డే షెడ్యూల్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో మూడు వన్డే మ్యాచ్ ల సిరీస్ ముగిసింది. ఈ సిరీస్ తో టీమిండియా స్టార్ ప్లేయర్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫామ్ పై ఉన్న ఆందోళనలు తొలగిపోయాయి. రోహిత్ శర్మ అద్భుతంగా ఆడి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకోగా .. తొలి రెండు వన్డేల్లో డకౌటైనా సిడ్నీ వన్డేలో హాఫ్ సెంచరీ చేసి కోహ్లీ మంచి టచ్ లో కనిపించాడు. కేవలం ఒకటే ఫార్మాట్ ఆడడంతో వీరి ఆట కోసం ఫ్యాన్స్ ఎంతగానో ఎదరు చూస్తున్నారు. కోహ్లీ, రోహిత్ వన్డేల్లో మాత్రమే కనిపించనుండడంతో వీరి నెక్స్ట్ షెడ్యూల్ ఎప్పుడు అని అభిమానులు ఆరాటపడుతున్నారు.

2027 వన్డే వరల్డ్ కప్ వరకు రోకో జోడీ ఆడాడతారని దాదాపుగా కన్ఫర్మ్ అయింది. ఏడు నెలల తర్వాత బరిలోకి దిగినా వీరిద్దరూ తమ ఫామ్ ను కొనసాగించి విమర్శకులకు సమాధానమిచ్చారు. 2027 వన్డే వరల్డ్ కప్ లోపు ఇండియా మొత్తం 21 వన్డే మ్యాచ్ లు ఆడనుంది. ఇందులో భాగంగా మొదట సౌతాఫ్రికాతో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ జరగనుంది. నవంబర్ 30 న తొలి వన్డే.. డిసెంబర్ 3 న రెండో వన్డే.. డిసెంబర్ 6 న మూడో వన్డే జరుగుతుంది. తొలి మూడు వన్డేలకు వరుసగా రాంచీ, రాయ్‌పూర్,విశాఖపట్నం ఆతిథ్యమిస్తాయి. సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ ముగిశాక ఇండియా వన్డే షెడ్యూల్ ఏంటో ఇప్పుడు చూద్దాం..

**2027 వరల్డ్ కప్ ముందు టీమిండియా వన్డే షెడ్యూల్:**

2025 నవంబర్,డిసెంబర్ లో దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆడనుంది.

2026 జనవరిలో న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్. ఈ ఇండియాలో ఈ సిరీస్ జరుగుతుంది.

2026 జూన్‌లో స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్

2026 జూలైలో ఇంగ్లాండ్‌తో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ (విదేశాల్లో)

2026 సెప్టెంబర్, అక్టోబర్ లో వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్

2026 అక్టోబర్, నవంబర్‌లో మూడు వన్డేల సిరీస్ న్యూజిలాండ్ లో జరగనుంది.

2026 డిసెంబర్ లో శ్రీలంకతో స్వదేశంలో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్

**రోహిత్ సూపర్ హిట్.. కోహ్లీ ఫ్లాప్:**

ఆస్ట్రేలియాతో ఇటీవలే ముగిసిన మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ లో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అదరగొట్టాడు. తొలి వన్డేలో విఫలమైనా రెండో వన్డేలో హాఫ్ సెంచరీ చేసి రాణించాడు. సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో చెలరేగుతూ సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఓవరాల్ గా ఈ సిరీస్ లో అత్యధిక పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు. మరోవైపు కోహ్లీ తొలి రెండు వన్డేల్లో డకౌటై తీవ్రంగా నిరాశపరిచాడు. అయితే మూడో వన్డేలో హాఫ్ సెంచరీ చేసి టచ్ లోకి వచ్చాడు.

## కంబ్యాక్ అంత ఈజీ కాదు: కోహ్లీ బాటలోనే కేన్ మామ..

# 9 ఏళ్ళ తర్వాత వన్డేల్లో విలియంసన్ డకౌట్



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ లో విరామం తర్వాత తొలి మ్యాచ్ లోనే రాణించడం ఈజీ కాదని మరోసారి రుజువైంది. ఇటీవలే ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ లో కోహ్లీ, రోహిత్ ఏడు నెలల తర్వాత తొలిసారి అంతర్జాతీయ మ్యాచ్ ఆడితే ఇద్దరూ విఫలమయ్యారు. రోహిత్ సింగిల్ డిజిట్ కే పరిమితం కాగా.. కోహ్లీ డకౌటయ్యాడు. ఇప్పుడు వీరిద్దరి దారినే న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియంసన్ అనుసరించాడు. సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన విలియంసన్ కు నిరాశే మిగిలింది. ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లో రీ ఎంట్రీ ఇచ్చిన కేన్ తన తొలి మ్యాచ్ లో డకౌట్ గా వెనుదిరిగాడు.  ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తర్వాత తొలి వన్డే ఆడిన ఈ కివీస్ దిగ్గజ క్రికెటర్ తొలి బంతికే బ్రైడాన్ కార్స్ బౌలింగ్ లో గోల్డెన్ డక్ ఔటయ్యాడు. కార్స్ వేసిన ఎక్స్ ట్రా బౌన్స్ ఆడే క్రమంలో విలియంసన్ బ్యాట్ అంచుకు బ్యాట్ తగిలి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. చివరిసారిగా 2016లో వన్డే క్రికెట్ లో ఆస్ట్రేలియాపై డకౌటైన ఈ కివీస్ స్టార్ 9 సంవత్సరాల తర్వాత పరుగుల ఖాతా తెరవకుండా పెవిలియన్ చేరాడు. ఈ ఏడాది ప్రారంభంలో ఇండియాపై ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఆడిన కేన్.. 7 నెలల తర్వాత ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం.

**సెంట్రల్ కాంట్రాక్ట్ వద్దనుకున్న విలియంసన్:**

న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ కేన్ వద్దనుకున్నారు. ఒకవేళ ఈ కాంట్రాక్ట్ లిస్ట్ లో ఉంటే జాతీయ జట్టు తరపున రెగ్యులర్ ప్లేయర్ గా ఆడాల్సి ఉంటుంది. విలియంసన్ మాత్రం అంతర్జాతీయ టీ20 క్రికెట్ లీగ్ లు ఆడాలనే తన కోరికను తెలిపాడు. సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్ లో లేకపోయినా ప్రధాన టోర్నీలకు అందుబాటులో ఉంటానని గతంలోనే కేన్ స్పష్టం చేశాడు. విలియంసన్ టీ20 వరల్డ్ కప్ 2026 ఆడతాని ప్రకటించడంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. పని భారాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న ఐసీసీ టోర్నీలో ఫిట్ గా ఉండేందుకు తాను ఈ నిర్ణయం తీసుకున్నానని ఈ కివీస్ దిగ్గజం చెప్పినా ద్వైపాక్షిక సిరీస్ పై ఆసక్తి చూపించడం లేదు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. ఇంగ్లాండ్ తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ బోణీ చేసింది. లక్ష్య ఛేదనలో డారిల్ మిచెల్ (78 నాటౌట్), మైకేల్ బ్రాస్‌వెల్ (51) హాఫ్ సెంచరీలతో రాణించడంతో.. ఆదివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఫలితంగా సిరీస్‌లో 1%-%0 లీడ్‌లో నిలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 35.2 ఓవర్లలో 223 రన్స్‌కు ఆలౌటైంది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (101 బాల్స్‌లో 9 ఫోర్లు, 11 సిక్సర్లతో 135) సెంచరీతో చెలరేగినా మిగతా బ్యాటర్ల నుంచి సహకారం దక్కలేదు.జెమీ స్మిత్ (0), బెన్ డకెట్ (2), జో రూట్ (2), జాకబ్ బెథెల్ (2), బట్లర్ (4), సామ్ కరన్ (6) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. బ్రూక్, జెమీ ఓవర్టన్ (46) ఏడో వికెట్‌కు 87 రన్స్ జోడించారు. ఛేజింగ్‌లో కివీస్ 36.4 ఓవర్లలో 224/6 స్కోరు చేసి నెగ్గింది. విల్ యంగ్ (5), రచిన్ రవీంద్ర (17), కేన్ విలియమ్సన్ (0) ఫెయిలయ్యారు. టామ్ లాథమ్ (24), మిచెల్ శాంట్నర్ (27) పర్వాలేదనిపించారు. బ్రైడన్ కార్సీ 3 వికెట్లు తీశాడు. బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య రెండో వన్డే బుధవారం హామిల్టన్‌లో జరుగుతుంది.

# టీమిండియాతో టెస్టు సిరీస్ కు దక్షిణాఫ్రికా జట్టు ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌తో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా తమ జట్టును ప్రకటించింది. గాయం కారణంగా గత కొంతకాలంగా జట్టుకు దూరమైన టెంబా బవుమా, కెప్టెన్‌గా పునరాగమనం చేశాడు. ఈ సిరీస్‌లోని తొలి టెస్టు నవంబర్ 14న కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్ మైదానంలో ప్రారంభం కానుంది. ఇటీవలే పాకిస్థాన్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు బవుమా పిక్క కండరాల గాయం కారణంగా దూరమయ్యాడు. అతని గైర్హాజరీలో ఐడెన్ మార్క్రమ్ జట్టుకు నాయకత్వం వహించగా, ఆ సిరీస్‌ను సఫారీ జట్టు 1-1తో డ్రా చేసుకుంది. తాజాగా ప్రకటించిన జట్టులో డేవిడ్ బెడింగ్‌హామ్ స్థానంలో బవుమాను ఎంపిక చేశారు. భారత పర్యటనలో స్పిన్ కీలక పాత్ర పోషించనుండటంతో దక్షిణాఫ్రికా తమ జట్టులో కేశవ్ మహారాజ్, సైమన్ హార్మర్, సెనురన్ ముత్తుస్వామి వంటి స్పిన్నర్లకు ప్రాధాన్యం ఇచ్చింది. పేస్ విభాగంలో కగిసో రబాడతో పాటు ఆల్‌రౌండర్లు కార్బిన్ బాష్, మార్కో యన్సెన్, వియాన్ ముల్డర్ ఉన్నారు.ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు నవంబర్ 14న కోల్‌కతాలో, రెండో టెస్టు నవంబర్ 22న గౌహతిలోని ఏసీఏ స్టేడియంలో జరగనుంది. గౌహతి మైదానానికి ఇదే తొలి టెస్ట్ మ్యాచ్ కావడం విశేషం. ఈ పర్యటనకు ముందు, నవంబర్ 2 నుంచి బెంగళూరు వేదికగా జరిగే భారత్ 'ఏ' జట్టుతో సిరీస్‌లో కూడా బవుమా ఆడనున్నాడు. ఇదే సిరీస్‌లో టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ కూడా పాదం గాయం నుంచి కోలుకుని తిరిగి మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు.

జట్టు ఎంపికపై దక్షిణాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్ మాట్లాడుతూ, "పాకిస్థాన్‌తో సిరీస్‌లో ఆడిన జట్టులోని చాలా మంది ఆటగాళ్లను కొనసాగించాం. వారు అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించి సిరీస్‌ను డ్రాగా ముగించారు. భారత్‌లో కూడా మాకు అలాంటి కఠిన సవాలే ఎదురవుతుందని భావిస్తున్నాం. పాక్‌లో రాణించిన ఆటగాళ్లు ఇక్కడ కూడా కీలకం కానున్నారు. ఇది కచ్చితంగా జట్టు సమష్టి కృషితోనే సాధ్యమవుతుంది" అని వివరించారు.

**భారత్‌తో టెస్టులకు దక్షిణాఫ్రికా జట్టు:**

టెంబా బవుమా (కెప్టెన్), ఐడెన్ మార్క్రమ్, ర్యాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెర్రెయిన్, డెవాల్డ్ బ్రెవిస్, జుబేర్ హమ్జా, టోనీ డి జోర్జి, కార్బిన్ బాష్, వియాన్ ముల్డర్, మార్కో జాన్సెన్, కేశవ్ మహారాజ్, సెనురాన్ ముత్తుస్వామి, కగిసో రబాడ, సైమన్ హార్మర్.

# గ్యాంగ్‌స్టర్‌గా సవాల్‌ను స్వీకరిస్తాడా?



జాన్వీ కపూర్ ఫ్యాషన్ మీరు స్టార్లను చూస్తారు

సత్య .. గ్యాంగ్ స్టర్ .. గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్ ..ఇంకా చాలా గ్యాంగ్ స్టర్ డ్రామాలు బాలీవుడ్ లో వచ్చాయి. ఇవన్నీ వేటికవే ప్రత్యేకం అని నిరూపించాయి. ఈ సినిమాల్లో నటీనటుల ప్రదర్శనలు పరాకాష్టలో మెప్పించాయి. అందుకే ఇప్పుడు మరోసారి గ్యాంగ్ స్టర్ డ్రామాను ఎంపిక చేసుకుంటే, దానిలో ప్రధాన పాత్రధారి కొత్తదనం, వైవిధ్యం ప్రదర్శించడంలో సత్తా చాటాల్సి ఉంటుంది. షారూఖ్ డాన్ లో అండర్ వరల్డ్ కింగ్ గా నటించి మెప్పించాడు. ప్రస్తుతం సిద్ధార్థ్ ఆనంద్ - కింగ్ - చిత్రంలో మరోసారి మాఫియా డాన్ గా నటిస్తున్నాడు.

ఇలాంటి సమయంలో ఒక నవతరం హీరో అండర్ వరల్డ్ లో ప్రవేశించే యువకుడిగా, పరిణతి చెందిన డాన్‌గా భిన్నమైన షేడ్స్ లో నటించాలంటే చాలా సవాళ్లను స్వీకరించాలి. నటనలో కొత్తదనం చూపించాలి. కథ, కథనంలో మేకర్స్ కొత్తదనం ఆవిష్కరించాలి. ముఖ్యంగా ఎమోషన్స్ ని కనెక్ట్ చేసే ఎలిమెంట్స్ ని జోడించాల్సి ఉంటుంది. ఎక్కడ ఏది సింక్ కాకపోయినా అది మిస్ ఫైర్ అవ్వడం ఖాయం.

కానీ ఇలాంటి ఒక సవాల్ ని స్వీకరించేందుకు నవతరం హీరో హర్షవర్ధన్ రాణే సిద్ధమవుతున్నాడు. అతడు ఇప్పటివరకూ రొమాంటిక్ కామెడీలతో ఆకట్టుకున్నాడు. సనమ్ తేరి కసమ్, ఏక్ దీవానే కి దీవానియాత్ చిత్రాలతో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్నాడు రాణే. ఈ రెండు చిత్రాలు ప్రేమకథలు.. రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్ నేపథ్యంలో రక్తి కట్టించాయి. కానీ ఇప్పుడు హర్షవర్ధన్ పూర్తిగా ఒక భిన్నమైన ప్రపంచంలోకి అడుగుపెట్టాల్సి ఉంటుంది. అండర్ వరల్డ్ మాఫియా పాత్ర అతడికి పూర్తిగా కొత్త. ఇది ఒక సవాల్.

ఇది తన కెరీర్ లో ఒక సాహసంగానే చూడాలి. డాన్ పాత్రలో మునుపెన్నడూ చూడని కొత్తదనాన్ని చూపించేందుకు అతడు చాలా శ్రమించాల్సి ఉంటుంది. ఒక రొటీన్ ప్రేమికుడిగా లేదా భగ్న ప్రేమికుడిగా కనిపించినంత సులువుగా డాన్ పాత్రలోకి ఒదిగిపోవడం కుదరదు. కానీ నటుడిగా కొత్త దశకు చేరాలంటే ఇలాంటి ఒక ప్రయత్నం చేయాలి. హర్షవర్ధన్ రొటీన్ కి భిన్నంగా ఒక డాన్ గా ఎలా పరివర్తన చెందుతాడో వేచి చూడాలి. ఈ ప్రతిష్ఠాత్మక గ్యాంగ్ స్టర్ డ్రామాను బాలాజీ టెలీఫిలింస్ అధినేత్రి ఏక్తాకపూర్ నిర్మించనున్నారు. ఒక అన్ నోన్ ప్రపంచం నుంచి అండర్ వరల్డ్ లోకి ప్రవేశించే యువకుడి భావోద్వేగాలను వెండితెరపైకి తీసుకు రావాలనే ప్రయత్నమిది. ఇది ఒక రకంగా ఆర్జీవీ సత్య స్టోరి లైన్ ని పోలి ఉంటుంది. కానీ ఇప్పుడు దానికి మించి మోడ్రన్ యుగపు డాన్‌గా హర్షవర్ధన్ పరిణతి చెందిన నటనను కనబరచాల్సి ఉంటుంది. తనకు సంబంధం లేకుండానే అండర్ వరల్డ్ లో ప్రవేశించే యువకుడిగా హర్షకు నటించేందుకు ఎక్కువ స్కోప్ ఉంది. కానీ అతడు ఏం చేస్తాడో వేచి చూడా.

హర్షవర్ధన్ తదుపరి %-%సిలా%-% చిత్రంలో సాదియా ఖతీబ్, కరణ్ వీర్ మెహ్రాతో కలిసి కనిపిస్తాడు. ఆ తర్వాత ఏక్తాకపూర్ నిర్మించే గ్యాంగ్ స్టర్ డ్రామా కోసం ప్రిపేర్ అవుతాడు. భూమిక నిర్మించిన తెలుగు సినిమా తకిట తకిట నుంచి హర్షవర్ధన్ రాణే ప్రయాణం ఆసక్తికరం. అతడు బాలీవుడ్ లో పెద్ద స్టార్ గా తనను తాను ఆవిష్కరించుకునే సమయంలో ఇది అద్భుత అవకాశం.



ప్రతి లుక్‌ని ఎలా రాక్ చేయడం శ్రీముఖికి తెలుసు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com